


# దీపావళి పండుగ

శ్రీ కృష్ణమాచార్య, ఎం. ఏ.

ఆవి దీపావళి రోజులు. టపాసుల కొట్లన్ని విరివిగా పెడుతున్నారు. పిల్లలంతా పండుగవస్తోందని గంతులేస్తున్నారు. కాని, బీద జనంమాత్రం ఎందుకో అంత సంతోషం వెలిబుచ్చటంలేదు. ధనవంతుల బిడ్డలందరు పండుగ రెండు మూడు రోజులుండగానే టపాకాయలు కొనిపించుకొని రోజూ కాల్చుకుంటున్నారు. కాని, ధనహీనుల బిడ్డల మాటో? వాళ్ళ పిల్లలకుకూడ టపాసులు కాల్చుకుందామని ఉండదూ? ధనవంతులు, ధనహీనులు అను విభేదము కృత్రిమముగా సృష్టించబడినదే గాని, చిన్నపిల్లల తత్వాలన్ని ఒకేవిధంగా ఉంటాయి ధనమున్నా సరే లేకపోయినా సరే.

తెనాలిలో కాలువగట్టునే పాకీ వాళ్ళ గృహాలుంటాయి. అందులో పాకీ వెంకామ గృహమొకటి. ఇంటి నిండా పిల్లలకోడిమాదిరి గంపెడు పిల్లలు. రెండు మాసాలనుంచి వెంకామ మొగుడు రోగంతో మంచాన పడున్నాడు. అందువలన వెంకామ స్వల్ప సంపాదనంతా అతని జబ్బే హాతం చేస్తుండేది. ఇంట్లో ముగ్గురు మొగపిల్లలు. ఇద్దరు ఆడపిలలు. అంతా 12 ఏండలోపు వసికూనలే. వీరందరిని పోషించవలసిన భారం వాళ్ళ తల్లిమీదనే పడింది. కాని, ఏంచేస్తుంది?

* * *

ఆనాడు దీపావళి పండుగ. వెంకామ మొగుడికి ఆరోజు మరీ ఎక్కువగా ఉంది. పిల్లలంతా టపాకాయల కోసం పీడించడం మొదలెట్టారు. చేతిలో పైసాఅయినా లేదు. తింటానికే లేనప్పుడు ఇట్లాంటివాటికి గూడ ఎక్కడనుంచివస్తాయి. ప్రొద్దుటనుంచి తిండి లేకపోవటంచేత పిల్లలంతా అల్లాడుతున్నారు. వేలకవేలు రూపాయలు టపాకాయలమీద తగలబెట్టటానికి ప్రాణం ఒప్పుతుందిగాని, ఆకలి బాధచే నులమల మాడుచు, తాను గన్న పిల్లలను పోషించుకొన లేక కుమిలి కృశించుచున్న బీద సాదలకు ఒక్కపూట తిండి పెట్టుటకు ప్రాణం పీకుతుందిగా మరి. వెంకామ భర్తను వదలివెళ్లుటకా వీలు లేదు. వైద్య సహాయము లభించుటా దుర్లభము. డబ్బు చేతిలో లేనిదే పిల్లలు "అన్నమో రామచంద్రా" అని శోషచెందుతున్నారు. ఆమెకు మనసు ఎటూ పాలుపోలేదు. చివరకు ఏమిచేయటానికీ తోచక మొండిధైర్యంచేసికొని చంటికూనను ఎత్తుకొని అన్నం అడుక్కురావటానికి ఊళ్ళోకి బయలుదేరింది. పాపం గర్భభారంవలన నడువ లేక అతి కష్టంలో అడుక్కోటం ప్రారంభించింది. ధనవంతుల ఇళ్ళల్లో మిగిలిపోయిన పదార్థాలని పాసిపోవు నట్లుచేసి బైట పారేయటానికిగాని, లేక ఏ కుక్కలకో పారేయగల్గుతారుగాని, మూడు దినాలనుంచి ఆకలి బాధచేతక్షోభచెందుచు, గర్భభారము చేత తిరుగలేక ఐదుగురు పిల్లలను

రెండునెలలనుండి రోగగ్రస్తుడై పడియున్న భర్తను పోషించలేక అల్లాడుచున్న వెంకామకు ఆఖరుకు తినగా పారేశిన ఎంగిలి మెతుకులను సైతము పెట్ట బుద్ధిపుడుతుందా? పాపం ఊరంతా దిమ్మతిరిగింది. ఆదుర్దాగా ఇంటికి వచ్చేటప్పటికి షుమారు ఆరు గంటలు కావస్తోంది.

ఇంటిబయట ఇద్దరుపిల్లలు మట్టితో ఆడుకొంటున్నారు నిశ్చింతగా. తల్లి ఒడిలో అన్నంచూడగానే ఎగబడ్డారు. లోపలికెళ్లింది. తక్కిన యిద్దరుపిల్లలు తండ్రిమీదబడి లేపటానికి ప్రయత్నం చేస్తున్నారు. వెంకామ భర్తను పరికించింది. గుండె బ్రద్దలైపోయింది. ఇంకేముంది అంతా శూన్యమే. వెంకామ ఆ నిమిషంనుంచి తాను భర్తహీన ఐన అభాగ్యురాలని తెలిసికొంది. తన కుటుంబమును ఎట్లో పోషింపుచున్న భర్త మృత్యువాత పడ్డపిదప తన ఐదుగురు బిడ్డలను పోషించువారెవ్వరు? సాధారణంగా అతి బీదలకే వారిమీద ప్రకృతి కసితీర్చుకోటానికో అన్నట్లు సంతానం అతి సమృద్ధిగా ఇస్తుంది. అసలే వాళ్ళ కుక్షులే పోషించుకొనలేక అతీతమగు బాధల నొందుచుండ, పైగా బిడ్డలుగూడ. కష్టాలు ఒంటరిగా రావన్నసామెత ఇదేగాబోలు! పైగా పాపం గర్భభారం. తాను పనిచేయటానికైనా అశక్తురాలయింది. బిడ్డలా ముక్కుపచ్చలారని పసికూనలు. వెంకామ చేయునదేదిలేక శొమ్మసిలి పడుంది.

* * *

రాత్రి షుమారు ఎనిమిదిగంటలు కావస్తోంది. ఊళ్ళోఅంతా బ్రహ్మాండంగా దీపాలు ముందర ధనవంతుల బిడ్డలు టపాసులు కాల్చేస్తున్నారు. కొందరు వాకిళ్ళముందర బొప్పాయి చెట్లను పాతి దీపాలతో అలంకరించారు. మంచెలుగా కట్టి అలంకరించారు మరికొందరు. వెంకామ పెద్దకొడుకు వీరడు. షుమారు పంద్రెండేళ్లుంటాయి. తాను కొనుక్కొని కాల్చుకోటానికి నోచుకోలేదు గనుక చూసైన ఆనందిద్దామని ఊళ్ళోకి బయలుదేరాడు. ఇళ్ళ ముందర వెలగకుండా పారేశిన వన్ని ఏరుకుంటున్నాడు. కొన్ని కొన్ని ఇళ్ల ముందు పిల్లలు వీరడుమీదనే పారేస్తున్నారు. చిచ్చుబుడ్లు క్రొత్త రకాల టపాసులు, ఒక్కొక్కటి వెలుగుతోంటే చూచి సంతోషంతో గంతు వేస్తున్నాడు వీరన్న.

బజారులో సంబరం చూడటానికి బయలు దేరాడు. తోటాలు విరివిగా కాలుస్తున్నారు. పందేలు వేస్తున్నారు. దెబ్బలాడుతున్నారు. వీరన్న తమాషా చూడటానికి అక్కడికే వచ్చాడు. ఇంతట్లోకే ఒక తూటా వీరన్న దగ్గరే వచ్చి పడింది. అంతకు

శిథిల దేహము—

మధుర జీవనము?

ఇది సాధ్యమా?

నదీతీరమున, పచ్చికబయలున, కొండచరియల విహరిస్తే ప్రకృతిశోభ కనబడుతుంది. అది మధుర జీవనము.

కాని అది నీకు సాధ్యమా?

నాల్గు అడుగులు ముందునకువేసిన నీ దేహమే నీకు భారమవుతుంది. తీరని ఆయాసము. కలకలలాడు ఆ నిండు శోభను చూడలేక తేజోవిహీనములగు నీ కనులు గూటిపక్షులులాగు నీటి తెరలవెనుక క్రుంగిపోతవి. నీవు నిరాశాభావముతో యెముకలగూడువలె నేల కూలిపోయెదవు. కాని మధురజీవనమునకు నీకు హక్కులేదా! ఉన్నది. దీనిని నీవనుభవించాలి. అందుకు తగిన శక్తి, బలము, ఝుయ్యిమంటూ ప్రవహించే ఉడుకు నెత్తురు సంపాదించాలి. దానితో నీలో ఒక నూత్న తేజస్సు, శక్తి బయలుదేరుతుంది. అందుకు సాధనము అమృత. అమృత సేవనము నీలో నవయౌవనమును ప్రవేశపెట్టగలదు. అది మధురజీవనము నీయందుబాటులో ఉంచగలదు. అమృత సేవనము నేడే ప్రారంభించు.

మధుర జీవనమునకు అమృత సేవనము

కేసరికుటీరం, ఎగ్మూరు, మద్రాసు—న యెల్లెడల అమృత దొరకును.



ముందే ఒక-యింటిదగ్గర అరికాలు గెలియ కాలటం వల్ల పరిగెత్తలేక పోయాడు. ఆతూటా అతని బట్టల్లో దూరింది. బట్టలంటుకొని ఒళ్ళంతా తెగ కాలింది. పాపం పండుగ సరదా అంతా ఈ విధంగా పరిణమించింది!

ఆసుపత్రిలో చేర్చారు వీరన్నని. విపరీతమైన బాధపడ్డాడు. బాధ ఓర్చుకోలేక పోయాడు. తన తల్లి దండ్రుల కోసం కలవరించాడు. ఆఖరుకు తన తండ్రినే చూడబోయాడు.

వీరన్న గృహంలో కనబడక పోవటంవల్ల వెంకామ స్పృహవచ్చినప్పటి నుంచి తెల్లవార్లూ వెతుకుతూనే ఉంది వీరన్నకోసం. కాని చివరకు తెలిసికొనగలిగింది తన వీరన్న వైద్యశాలలో నున్నాడని. తన కొడుకుని ఆదుర్దాగా చూడబోయింది ఆసుపత్రికి. తుదకు వీరన్న శవాన్ని మాత్రమే చూడగలిగింది. దుఃఖ భారము భరించ లేకపోయింది. ముందు భర్తచావు. కొద్ది గంటలకే తన కుమారుని దుర్మరణము. గుండెలు బాదుకొంది. శోకాలు పెట్టింది. పాపం పుత్రశోకం ఎవరు ఓదార్చ గలరు పిచ్చిదానిమాదిరి రోడ్లో వెంటపరుగెత్తింది. గుడిశె చేరింది. తన నల్గురి పిల్లల్ని తీసికొని తొందరగా బయలుదేరింది. ఎక్కడికో? రెండుమూడు రోజులు గడిచాయి. జనమంతా చాల ఆదుర్దాగా పత్రికలలో చూస్తున్నారు ఆ రోజు ప్రొద్దుట, "ఆంధ్ర పత్రిక లో" యీవిధంగా ప్రకటింపబడిఉంది.

## ఘోర మరణములు

(స్వకీయ విలేఖరి, తెనాలి.)

15—10—35.

ఈ ఊరిలో వెంకామ అను పూర్ణగర్భిణి యగు పాకీ యువతి ఒకతె తనబిడ్డలను పోషించుకొనలేక తన నల్గురి బిడ్డలతో కాలువలో బడి బలవన్మరణము చెందినది. క్రిందటి దినమే భర్త వ్యాధి వల్లను కుమారుడు కాల్పుల వల్లను చనిపోవుటయే యీమె ఆత్మహత్యకు కారణమని తెలియుచున్నది.

ఈ ప్రకటన చూచి హృదయం కలవాళ్లు రెండు కన్నీటి బొట్లుమాత్రం వదల గలిగారు. కాని మరుక్షణమో?

